క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పడిపూజ



స్వామికి పడి పూజ చేస్తున్న మాలధారులు

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట మఠంలో ధనుర్మాసం సందర్భంగా వేంకటేశ్వరస్వామికి పడి పూజ నిర్వహించారు. పట్టణానికి చెందిన గోవింద మాలధారులు, భక్తులు స్వామివారిని కొలువుంచి గోవింద నామస్మరణలతో పడి పూజ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన



మందులు అందజేస్తున్న రామ్‌కో ప్రతినిధులు

కొలిమిగుండ్ల: కల్వటాలలో రామ్‌కో సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి రైతుల నుంచి స్పందన లభించింది. శిబిరాన్ని రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు, అడ్మిన్‌హెడ్ రామరాజు ప్రారంభించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ మోహనరావు, డాక్టర్ రమేష్‌బాబు గొర్రెలు, గేదెలకు చికిత్స చేశారు. గొర్రెలకు జబ్బువాపు, గేదెలకు గర్భకోశ, పాదుగు వ్యాధులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం రవికుమార్, ఈఓఆర్డీ శివ ప్రసాద్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బలిజ సంఘం నేతలు

కోవెలకుంట్ల: పట్టణంలోని బలిజ సంఘం కార్యాలయంలో శనివారం శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బాలమురళీకృష్ణ, బలిజ సంఘం నాయకులు విజయ్‌కుమార్, సుబ్బన్న, శంకరుడు, ఈశ్వరయ్య, పరంధాముడు, రమణయ్య, శ్రీనివాసులు, నాగరాజు, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, రామమోహన్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛ కోవెలకుంట్లపై ర్యాలీ

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు సూచించారు. స్వచ్ఛ కోవెలకుంట్ల కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఎల్‌ఎం కాంపౌండ్, స్వామినగర్ కాలనీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే పారిశుద్ధ్య లోపాన్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. బహిరంగ మలవిసర్జన ద్వారా అనేక వ్యాధులు ప్రబలే అస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విళక్కి పూజ



పూజలందుకున్న స్వామివారు

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీతత్వమసి అయ్యప్పస్వామి ఆలయంలో మణికంఠ భక్త బృందం సభ్యులు శనివారం విళక్కి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి స్వామి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు చేసి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్పమాలధారుల నృత్యాలు, భక్తి పాటలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు సాగింది.

మినీ క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బేతంచెర్ల: సిమెంట్‌నగర్ గ్రామంలోని హోలి ట్రినిటీ చర్చిలో శనివారం మినీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. క్యాండిల్ లైట్ సర్వీస్ జరుపుకున్నారు. చర్చి పాస్టర్ వినోద్‌కుమార్, కార్యదర్శి డేవిడ్ రాజు, ట్రెజరర్ సుధాకర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు స్వాములు, జయకర్, మోజేస్, విజయ, మరియమ్మ పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం

- పండుగలా మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు



కోవెలకుంట్ల: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బనగానపల్లెలో కేక్ కట్ చేస్తున్న కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పట్టణాలు, పల్లెలు పండుగను తలపించాయి. పలు చోట్ల అన్నదానం చేశారు.

పోరాట యోధుడు వైఎస్ జగన్

వైఎస్ జగన్ ప్రజల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తూ పోరాట యోధుడిగా ఖ్యాతి గడించారని ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కోవెలకుంట్ల పట్టణంలో కేక్‌కట్ చేసి వేడుకలు జరిపారు. అనంతరం స్థానిక పాండురంగస్వామి దేవాలయ సమీపంలో కర్రా దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మాజీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నాయకులు అమడాల భాస్కర్‌రెడ్డి, పోతం రాం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వయసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి నిత్యం ప్రజల్లోనే ఉంటూ అత్యంత ప్రజాదరణ కలిగిన జననేతగా ఎదిగారని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రిగా అనతికాలంలోనే అత్యంత శక్తివంతమైన నేతగా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పాలన అందించి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. గత ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుని అనతికాలంలోనే విమర్శల పాలైందని ఎద్దేవా చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రా తేజవర్ధన్‌రెడ్డి, కర్రా ధరహాస్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, రఘునాథరెడ్డి, ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, రాంశంకర్ రెడ్డి, రమణారెడ్డి, లోకేశ్వరరెడ్డి, గోనవరం రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె మండలంలో..

పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ అవుకు, బనగానపల్లె మండలాల కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ ఖైర్, అత్తార్‌జాహెద్, అనీల్, మాబుసా, రామచంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, కరీం, రోబో, కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, సురేష్‌నాయుడు, ఈశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.



సంజామల: నొస్సంలో జెడ్పీ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో.. ,



అవుకు: కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ శివరాంభూపాల్‌రెడ్డి

కొలిమిగుండ్ల మండలంలో..

కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.

సంజామల మండలంలో..

మండలంలోని నొస్సంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు బైరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవుకు మండలంలో..

మండలంలోని జూనుతలలో సర్పచ్ శివరాంభూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జరిపారు. కేక్‌కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.



కోవెలకుంట్లలో కేక్ కట్ చేస్తున్న కర్రా దంపతులు

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



డోన్: కేక్ కట్ చేస్తున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు



ప్యాపిలి: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బేతంచెర్ల: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందని తెలిపారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఏపీని దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను గాలికొదిలేసి ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు తిరునాంపల్లె తిరుమలరెడ్డి, మాజీ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, సర్పంచ్‌లు రమణ, బంగారు జయచంద్ర, నాగన్న, మాజీ సర్పంచ్ ఎద్దుపెంట నరసింహారెడ్డి, నాయకులు ఎద్దుల రాజేంద్రనాథ్‌రెడ్డి, మల్యాల శ్రీనువాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు జనరంజక పాలన అందించారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, మూర్తుజావలీ, ఖాజా అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి గత ప్రభుత్వ పాలనను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగస్వామి, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, వార్డు కౌన్సిలర్స్ కోట్ల మధు, ఇబ్రహీం, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, మురళీకృష్ణ, తిరుమలేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, వలీబాషా, సలీం, కిరణ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతుదొడ్డి కృష్ణమూర్తి, మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి ఆనందోత్సాహలతో జరుపుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బొర్రా మల్లికార్జునరెడ్డి, రాజా మురళీకృష్ణ, బోరెడ్డి రాము, కమతం భాస్కర్ రెడ్డి, జంగం చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, జంగం చంద్రశేఖర్, కొండయ్య, సోమశేఖర్, బాలరంగడు, మద్దయ్య, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పూజారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్యాపిలి: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్‌రెడ్డి శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. యర్రగుంట్లపల్లి గ్రామానికి చెందిన తులసీరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నేరేడుచెర్ల గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. కొలుపల్లి గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయా గ్రామాల్లో పర్యటించిన అర్జున్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు నేరేడుచెర్ల సర్పంచ్ అనిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, రజనీరెడ్డి, శ్యాంరెడ్డి, తులసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న బుగ్గన అర్జున్ అమర్‌నాథ్ రెడ్డి

ఘనంగా మాజీ సీఎం జన్మదిన వేడుకలు

మండల పరిధిలోని యర్రగుంట్లపల్లిలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుగ్గన అర్జున్ రెడ్డి కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంకితభావానికి సత్కారం

డోన్: పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో అభ్యర్థుల విజయానికి కృషి చేసిన వ్యక్తి పోస్టు ప్రసాద్ అని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు కొనియాడారు. పార్టీ వలంటీర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పోస్టుప్రసాద్‌ను శనివారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, నాగభూషణంరెడ్డి, వ్యవసాయ సలహామండలి మాజీ అధ్యక్షుడు కొత్తకోట చంద్రన్న, నాయకులు వలి, రాజేంద్రనాథ్‌రెడ్డి, రైల్వే నాయుడు, కోఆప్షన్ సభ్యులు పాతపేట రఫీ, హరి పాల్గొన్నారు.



పోస్టుపసాద్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, తదితరులు

సంక్షిప్తం

27న జాబ్ మేళా

డోన్ టౌన్: డోన్ ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న న్యాక్ శిక్షణా కేంద్రంలో ఈనెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, స్పందన స్ఫూర్తి ఫైనాన్సియల్ లిమిటెడ్, ఎస్‌కే బయోటెక్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9573108032, 79812 38237 నంబర్లను లేదా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

హిందీ ప్రతిభా పరీక్షల్లో సత్తా



కావేరిని అభినందించిన ప్రిన్సిపాల్ శ్రీలేఖ, ఉపాధ్యాయులు

సంజామల: రాష్ట్ర స్థాయి హిందీ ప్రతిభా పరీక్షల్లో సంజామల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని కావేరి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ శ్రీలేఖ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు నవంబర్ 22వ తేదీ మన సంస్కృతి హిందీ ప్రతిభా పరీక్షలను నిర్వహించారన్నారు. వెలువడిన ఫలితాల్లో తొమ్మిదో తరగతికి చెందిన కావేరి ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటిందని కొనియాడారు. శనివారం కేజీబీవీ పాఠశాలలో బాలికను అభినందించారు.

గణిత మేధావికి ఘన నివాళి



ఏపీ మోడల్ స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

బేతంచెర్ల: ప్రపంచం గర్వించదగ్గ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు అన్నారు. శనివారం మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలతోపాటు మోడల్ స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

బనగానపల్లె రూరల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బనగానపల్లె సీఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. సీఐ మాట్లాడుతూ.. పాఠశాల విద్య విద్యార్థులకు కీలకమని, ఈ దశలో విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని తెలిపారు. అలాగే సెల్‌ఫోన్, టీవీ, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపైనే ధ్యాస ఉంచాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, ప్రిన్సిపాల్ రామలక్ష్మి పాల్గొన్నారు.

24 నుంచి కబడ్డీ పోటీలు

కొలిమిగుండ్ల: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బెలుంలో సీఎస్‌ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి రెండు రోజుల పాటు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చర్చి ఆవరణలో పోటీలు జరుగుతాయన్నారు. 23వ తేదీ సాయంత్రంలోగా క్రీడాకారులు రూ.300 చెల్లించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో మొదటి బహుమతి రూ.20,016, రెండో బహుమతి రూ.15,016, మూడో బహుమతి రూ.10,016, నాల్గవ బహుమతి రూ.5,016 అందజేస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 9652563600, 9676970673 నంబర్లను సంప్రదించాలన్నారు.

చెత్త తొలగింపు

అవుకు: మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను ఎట్టకేలకు తొలగించారు. కొద్ది రోజులుగా చెత్త పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై శనివారం సాక్షి దినపత్రికలో ముక్కు మూసుకోవాల్సిందే అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చెత్తా చెదారాన్ని తొలగించారు. పరిసరాలను శుభ్రం చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



చెత్తను తొలగిస్తున్న కార్మికుడు

గుండెపోటుతో రైతు మృతి

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామానికి చెందిన రైతు కమలపూరి శివసుబ్బరాయుడు(42) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఈయన తనకు ఉన్న ఒకటిన్నర ఎకరాల పొలంలో వరి పంట వేశారు. కోత కోసిన ధాన్యాన్ని గ్రామ సమీపంలో ఉన్న దాబా వద్ద అరబెట్టుకుని ధాన్యాన్ని అటుఇటు కదిలిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. గమనించిన స్థానికులు స్థానికంగా ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ముగ్గురు సంతానం ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బేతంచెర్ల: ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందుతారని ధ్యాన పిరమిడ్ మాస్టర్లు రాజు, మద్దయ్య అన్నారు. శనివారం నంద్యాల రహదారిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన పిరమిడ్ మందిరంలో నిర్వాహకుడు భువనేశ్వరరాజు ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అలాగే గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయలు, విద్యార్థులు ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని జరుపుకున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



డోన్ టౌన్: పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్, శ్రీగౌరి చిన్నపిల్లల క్లినిక్ భవనాలకు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మీటర్లు శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యాయి. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. బ్యాంకు సిబ్బంది సకాలంలో స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన ఏఈ నాగేశ్వర్ రెడ్డి సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు షార్ట్ సర్క్యూట్‌కు గురైన విద్యుత్ మీటర్లను, పరికరాలను పరిశీలించి మరమ్మతులు చేశారు. మంటలు చూసి కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు నాగరాజు అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని యు.కొత్తపల్లె జెడ్పీ హైస్కూల్‌లో వినియోగదారుల రక్షణ, హక్కులపై అవగాహన కల్పించారు. బిల్లులు తీసుకోవడం వల్ల వస్తువులో ఏదైనా లోపం ఉంటే న్యాయపరంగా రక్షణ పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపులు, వినియోగదారుల హక్కులు, బాధ్యతలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వినియోగదారుల సమాచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రాంప్రసాద్, రంగారెడ్డి, మురళీధర్ కుమార్, రఫీ, రఘునాథ్, సుధాకర్, భాగ్యలక్ష్మి, శాంతి, రవికుమార్ పాల్గొన్నారు.